


సంచలన సాయంకాల పత్రిక

# సత్యం

https://www.satyamdaily.net/

సోమవారం 19-5-2025

సంపుటి: 21 సంచిక: 47
పేజీలు: 8 వెల: రూ.1

## విజయనగరంలో ఉగ్రమూలం..

# శ్రీకాకుళంతో బంధుత్వం

- పక్క జిల్లాలో పేలుళ్లకు ట్రయల్స్
- జిల్లాలో ఇటువంటివారిపై మొదలైన సెర్చ్ ఆపరేషన్



**దేశంలో మరోమారు బాంబు పేలుళ్లకు పూనుకోవాలనుకున్న ఉగ్రవాదుల కుట్రను భగ్నం చేసిన కేసులో మూలాలు విజయనగరంలో ఉంటే.. ఇందులో సూత్రధారి సిరాజ్ ఉర్ రెహ్మాన్(29)కు బంధుత్వం శ్రీకాకుళంతో ఉంది. అంతమాత్రాన ఉగ్రవాదులతో సంబంధం వీరికీ ఉన్నట్టు కాదుగానీ, శ్రీకాకుళంలో ఓ మాజీ కౌన్సిలర్, ముస్లిం మైనార్టీ నాయకుడు తోడల్లుడికి మేనల్లుడని భోగట్టా. దీంతో నగరంలో ఒక్కసారిగా కలకలం రేగింది.**



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

దేశంలో పలు ప్రదేశాల్లో బాంబులు పెట్టి అల్లకల్లోలం సృష్టించడానికి ప్రయత్నించిన వారిలో విజయనగరానికి చెందిన యువకుడు ఉన్నాడని ప్రధాన మీడియా ద్వారా తెలుసుకున్న స్థానికులు విస్తుపోయారు. ఉగ్రమూలాలు మనకు ఆనుకొని ఉన్న జిల్లా వరకు వచ్చాయని తెలిసి నిర్ఘాంతపోతున్నారు. మరీ ముఖ్యంగా నిందితుడు రెహ్మాన్ తండ్రి, అన్న పోలీస్ డిపార్ట్‌మెంట్‌లో పని చేస్తుండటం ఇప్పుడు పెద్ద ఎత్తున చర్చకు దారితీస్తోంది. నగరంలో కూడా ఇటీవల ముక్కూమొహం తెలియని కొత్త వ్యక్తులు కనిపిస్తున్నారు. దీనిపై ఎప్పటికప్పుడు పోలీసులు ఆరా తీస్తున్నారు. ఇంతవరకు రోహింగ్యాలు జిల్లాలో వివిధ పనుల్లో కుదురుకున్నారని ఇంటెలిజెన్సీ భావిస్తూవచ్చింది. కానీ ఏకంగా ఉగ్రభూతమే పక్కజిల్లాలో ఉందంటే, కచ్చితంగా జిల్లాలో కూడా కొందరు యువకులను ఈమేరకు ఉచ్చులో పడేసివుంటారన్న కోణంలో పరిశోధన సాగుతోంది. ఇటీవల పెద్దమసీదులో నాలుగు గంధపు చెట్లు మాయమవడంతో పోలీసులు రంగ ప్రవేశం చేశారు. వాస్తవానికి సాధారణ గంధపు చెట్లు అక్రమ నరికివేతకు సంబంధించి పోలీసులు ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్ కంటే ఈ అంశాన్ని సీరియస్‌గా తీసుకోవాల్సిన అవసరం లేదు. కానీ ఫారెస్ట్ కంటే పోలీసులే ఎక్కువసార్లు మసీదులో విచారణ చేపట్టారు. ఇందులో భాగంగా అసలు మొదట్నుంచి నగరంలో ఉన్న మసీదులకు వస్తున్నవారెవరూ అడపా దడపా ఏదో పూట నమాజుకు వచ్చి ఎవర్ని కలిసి వెళున్నారనే దానిపై ఎస్పీ నేతృత్వంలోని స్పెషల్ బ్రాంచ్ ఆరా తీసింది. ఇంకా ఒక సమగ్రమైన నివేదికను రూపొందిస్తున్న సమయంలోనే పక్క జిల్లాలో ఉగ్రభూతం కనిపించడం సంచలనం రేకెత్తిస్తుంది. జీహాద్ భావజాలంతో విజయనగరం నిందితుడు సిరాజ్ ఉర్ రెహ్మాన్ అక్కడ కూడా ఎవరితోనూ కలిసేవాడు కాదని చెబుతున్నారు. ఇక్కడ కూడా నగరంలో ఉన్న ముస్లింల కంటే ఖురాన్ మీద, ఖుదా మీద, అరబ్బీ మీద ఎక్కువ పట్టున్నవారికి రెడ్‌కార్పెట్ పరుస్తున్నారు. సహజంగా ఇలాంటి భావజాలం ఉన్నవారిని అంచనా వేయడం ఏ మతంలోనైనా కష్టం. శ్రీకాకుళంలో కూడా నలుగురితో కలవకుండా - మిగతా చివరి పేజీలో

# ‘ఉపాధి’ ఊపిరి ఆగుతోంది!

- కూలీలు, ఉద్యోగులకు వేతనాల్లేవు
- పనుల మంజూరులో ఎంతో వేగం
- నిధులు అందక ఆవహిస్తున్న నీరసం
- సిబ్బందిని వేధిస్తున్న డ్వామా పీడీ



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

గ్రామీణ ప్రాంతాల నుంచి వలసల నివారణకు, వ్యవసాయ పనుల్లేని కాలంలో గ్రామాల్లోనే కనీసం వంద రోజులు పని కల్పించి గ్రామీణ ప్రజలను ఆర్థికంగా అండగా నిలిచేందుకు - మిగతా చివరి పేజీలో




# నర‘సన్నబడిన’ చెరువు



- పేట నడిబొడ్డులోనే ఆక్రమణలు
- రాజకీయం, అధికారం అండదండ

(సత్యంన్యూస్, నరసన్నపేట)

చెరువుల దురాక్రమణ జిల్లా అంతటా యథేచ్ఛగా సాగుతుందని చెప్పడానికి నరసన్నపేట పట్టణంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ ఎదురుగా ఎంఎల్ఆర్ కాలేజీకి పక్కన ఉన్న సుమారు ఐదెకరాల విస్తీర్ణం ఉన్న నరసన్న చెరువు దురాక్రమణదారుల చేతిలోకి వెళ్లిపోయింది. రాజకీయ ప్రోద్బలంతో, రెవెన్యూ, పంచాయతీ అధికారుల సహకారంతో చెరువు చుట్టూ - మిగతా చివరి పేజీలో



• ఎడిటోరియల్

## ట్రంప్ వాణిజ్య అస్త్రం.. ఎవరికి నష్టం?

పహల్గాంలో ఉగ్రవాదుల అమానుష దాడికి ప్రతిగా వారిని పెంచి పోషిస్తున్న పాకిస్తాన్‌పై భారత్ మే ఏడో తేదీ నుంచి సైనిక చర్యక దిగింది. దాంతో పాకిస్తాన్ కూడా భారత్‌పై డ్రోన్లు, క్షిపణులతో ఎదురుదాడి ప్రారంభించింది. అయితే భారతశక్తియుక్తుల ముందు నిలవలేకపోయింది. ఈ తరుణంలో మే పదో తేదీన సాయంత్రం ఐదు గంటల నుంచి ఇరుదేశాల మధ్య కాల్పుల విరమణ మొదలైనట్లు హఠాత్తుగా టీవీ స్క్రీన్లపై బ్రేకింగ్ వార్తలు రావడం మొదలైంది. ఇరుదేశాలను కాల్పుల విరమణకు తానే ఒప్పించినట్లు అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ప్రకటించడం చర్చనీయాంశంగా మారింది. ట్రంప్ అక్కడితో ఆగలేదు.. భారత్-పాక్ మధ్య తలెత్తిన అణుయుద్ధ పరిస్థితులను కూడా తానే ఆపానని ప్రకటించారు. దీనిపై మరో సందర్భంలో మాట్లాడుతూ కాల్పుల విరమణకు అంగీకరించకపోతే భారత్, పాక్‌లతో వాణిజ్యాన్ని నిలిపివేయాల్సి వస్తుందని రెండు దేశాలను తాను హెచ్చరించానని, ఫలితంగానే కాల్పుల విరమణ అమల్లోకి వచ్చిందని ట్రంప్ మరో ప్రకటన కూడా చేశారు. తనంతట తానుగా రెండు దేశాల అంతర్గత వ్యవహారాల్లో ట్రంప్ చొరబడటం విమర్శలకు దారి తీసింది. అలాగే ట్రంప్ హెచ్చరికలపై మరో రకమైన చర్చ కూడా జరుగుతోంది. కాల్పుల విరమణకు అంగీకరించకపోతే వాణిజ్యాన్ని పూర్తిగా నిలిపివేస్తామని ట్రంప్ బెదిరింపులను ప్రస్తావిస్తూ.. అటువంటి హెచ్చరికల వల్ల పరిణామాలు ఎలా ఉంటాయి? భారత్, పాక్‌లలో ఎవరు ఎక్కువ నష్టపోతారన్నదానిపై వాణిజ్య, ఆర్థిక రంగాల నిపుణులు విశ్లేషిస్తున్నారు. పలు విశ్లేషణల ప్రకారం అమెరికా గనుక వాణిజ్యాన్ని నిలిపివేసే పరిస్థితులే తలెత్తితే.. భారత్ కంటే పాకిస్తానే తీవ్రంగా నష్టపోతుంది. అదెలా అంటే.. భారత్-అమెరికా మధ్య 2021-22లో ద్వైపాక్షిక వాణిజ్యం 119.42 బిలియన్ డాలర్లు దాటింది. ఇందులో 76.11 బిలియన్ డాలర్ల ఎగుమతులు, 43.31 బిలియన్ డాలర్ల దిగుమతులు ఉన్నాయి. భారత ఎగుమతుల్లో అమెరికా 18 శాతం వాటా కలిగి ఉంది. ఇరుదేశాల మధ్య వాణిజ్యం నిలిచిపోతే ఫార్మాస్యూటికల్స్, సాఫ్ట్‌వేర్ సేవలు, ఆభరణాలు, టెక్స్‌టైల్స్ తదితర రంగాలు భారీగా నష్టపోతాయి. భారత్ ఐటీ, బీపీవో సేవలు అమెరికా మార్కెట్‌పై ఎక్కువగా ఆధారపడుతున్నాయి. దీనివల్ల టీసీఎస్, ఇన్ఫోసిస్ వంటి కంపెనీలు గణనీయమైన ఆదాయాన్ని కోల్పోవచ్చు. అమెరికాతో రక్షణ ఒప్పందాలు, సాంకేతిక భాగస్వామ్యం ఆగిపోవడం వల్ల భారత్ రక్షణ సామర్థ్యంపై ప్రభావం చూపవచ్చు. అమెరికాకు ప్రత్యామ్నాయంగా యూరోపియన్, అసియా మార్కెట్ల వైపు భారత్ మళ్లవచ్చు, కానీ దానికి కొంత సమయం పడుతుంది. ప్రపంచ దేశాలతో భారత్ అనుసరిస్తున్న వైవిధ్యమైన వాణిజ్య విధానాలు ఈ సమయంలో అక్కరకు వస్తాయి. దేశీయంగా సాధిస్తున్న ఆర్థిక వృద్ధి ఈ నష్టాన్ని కొంతవరకు తగ్గించగలదు. అమెరికా విధించే టారిఫ్‌లను ఎదుర్కోవడానికి భారత్ ఫార్మాస్యూటికల్స్, ఆటోమొబైల్స్ వంటి రంగాలకు తక్కువ టారిఫ్‌లను ప్రతిపాదించవచ్చు. కానీ పాకిస్థాన్‌పై అమెరికా వాణిజ్య ప్రభావం చాలా ఎక్కువ. భారత్‌తో పోలిస్తే పాక్ ఆర్థిక వ్యవస్థ చిన్నది. అమెరికాపైనే ఎక్కువగా ఆధారపడుతుంది. అమెరికాయే పాకిస్తాన్‌కు ప్రధాన ఎగుమతి గమ్యస్థానం, ప్రధానంగా టెక్స్‌టైల్స్, కాటన్, లెదర్ ఉత్పత్తుల వ్యాపారమే పాక్ ఆర్థిక వ్యవస్థలో 60 శాతం వాటా కలిగి ఉంది. ఈ రంగాలు తీవ్రంగా దెబ్బతింటాయి. మరో కీలక విషయం ఏమిటంటే.. అమెరికా నుంచి ప్రస్తుతం ఆయుధాల సరఫరా, సిబ్బందికి శిక్షణ వంటి సైనిక సహాయం నిలిచిపోయి పాక్ సైనిక సామర్థ్యాన్ని బలహీనపరుస్తుంది. ఇప్పటికే ఆర్థిక సంక్షోభంలో ఉన్న పరిస్థితుల్లో అమెరికా వాణిజ్యం, ఆర్థిక సహాయం నిలిచిపోతే పాక్ ఆర్థిక వ్యవస్థ మరింతగా చితికిపోతుంది. ఈ పరిస్థితే ఏర్పడితే ఆ దేశం పూర్తిగా చైనాపైనే ఆధారపడాల్సి వస్తుంది. ఇది పాకిస్తాన్‌ను అంతర్జాతీయంగా ఒంటరిని చేయవచ్చు. వాణిజ్యం నిలిపివేత వల్ల భారత్, పాక్‌లతో పాటు అమెరికాకు కూడా పలు రూపాల్లో నష్టం తప్పదని అంతర్జాతీయ నిపుణులు విశ్లేషిస్తున్నారు. భారత్ వంటి ముఖ్యమైన భాగస్వామిని కోల్పోవడం వల్ల ఆసియా ప్రాంతంలో అమెరికా ప్రభావం తగ్గుతుంది. అలాగే పాక్‌తో సంబంధాలు ఆగిపోతే ఆఫ్ఘనిస్తాన్, మధ్య ఆసియాలో అమెరికా గూఢచర్య కార్యకలాపాలకు విఘాతం ఏర్పడుతుంది. అమెరికా తమతో వాణిజ్యాన్ని నిలిపివేస్తే ఆ గ్యాప్‌ను భారత్, పాక్‌లు ఇతర దేశాలతో భర్తీ చేసుకుంటాయి. దీనివల్ల ప్రపంచ వాణిజ్య రంగంపై అమెరికా ప్రభావం తగ్గిపోతుంది. ఆర్థికంగా కూడా కొంత నష్టపోతుంది.

### కొలువులకు సరైన వేదిక "కాకినాడ ఆదిత్య"




(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

కొలువులకు సరైన వేదిక కాకినాడ ఆదిత్య కళాశాలలని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. స్థానిక ఎనభై అడుగుల కూడలి వద్ద గల కాకినాడ ఆదిత్య మహిళా డిగ్రీ కళాశాలలో, ప్రముఖ కంపెనీలలో ఎక్కువ ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ సోమవారం అభినందించారు. అనంతరం మాట్లాడుతూ శ్రీకాకుళంలో ఇంత మంచి వార్షిక వేతనాలతో డిగ్రీతో ఉద్యోగాలను సాధించడం గొప్ప విషయమని, ప్రస్తుతం ఉద్యోగాలు సాధించడం చాలా కష్టంగా ఉన్న తరుణంలో, ప్రతి విద్యార్థి రెండు లేదా అంతకంటే ఎక్కువ ఉద్యోగాలు సాధించడం అభినందించవలసిన విషయమన్నారు. విద్యార్థినులను క్రమశిక్షణతో పాటు, కొలువులకు ఎలా సిద్ధమవ్వాలో డిగ్రీ మొదటి సంవత్సరం నుండే అన్ని రకాలుగా శిక్షణను అందజేస్తున్న యాజమాన్యానికి ప్రత్యేక అభినం దనలన్నారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ బిఎస్ చక్రవర్తి, ప్రిన్సిపాల్ కె శివశంకర్, ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.

### ఇంజనీరింగ్ విద్యార్థినికి ఆర్థిక సహాయం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

స్థానిక రెల్లవీధిలో నివసించే స్వాతి కుమార్తె ఎలుగుమహంతి శ్రీ అనుష చదువు నిమిత్తం డాక్టర్ అరికతోట కనకరాజు, ఉమ దంపతులు రూ.5వేలు చెల్లించారు. ఆమె 10వ తరగతి, ఇంటర్, ఈఏపీసెట్ రాసిన అనంతరం టెక్కలి ఐతమ్‌లో ఇంజనీరింగ్ చేస్తున్నారు. ప్రస్తుతం రెండవ సంవత్సరం విద్యనభ్యసిస్తున్నారు. ఆమె తల్లి ప్రైవేటు రంగంలో పని చేస్తుండడంతో ఆర్థిక ఇబ్బందుల వలన తాత కరకవలస భువనేశ్వరరావుపై ఆధారపడి ఉన్నారు. ప్రస్తుతం బ్యాంకుల నుంచి విద్యారుణం కోసం కూడా ప్రయత్నిస్తున్నారు. విషయం తెలుసుకున్న కనకరాజు దంపతులు రూ.5 వేలు అందజేశారు.



### ఏఐవైఎఫ్ జాతీయ కార్యవర్గ సభ్యునిగా

## మొజ్జాడ యుగంధర్

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)



అఖిలభారత యువ జన సమాఖ్య (ఏఐవైఎఫ్) జాతీయ కార్యవర్గ సభ్యునిగా జిల్లాకు చెందిన మొజ్జాడ యుగంధర్ నియమితులయ్యారు. తిరుపతిలో ఈ నెల 15 వ తేదీ నుంచి 18 వరకు జరిగిన ఏఐవైఎఫ్ జాతీయ మహాసభల్లో యుగంధర్‌ను ఎన్నుకున్నారు. కమ్యూనిస్టు భావజాలంతో విద్యార్థి దశ నుండే విద్యార్థుల హక్కుల కోసం పోరాడి విద్యార్థి సంఘాల్లో కీలకంగా వ్యవహరించిన యుగంధర్ అనంతరం యువజన సమైక్యలో కీలకంగా వ్యవహరించారు. గత ఫిబ్రవరిలో శ్రీకాకుళంలో జరిగిన ఏఐవైఎఫ్ రాష్ట్ర మహాసభల నుంచి రాష్ట్ర అధ్యక్షునిగా యుగంధర్ కొనసాగుతున్నారు. ఇప్పుడు జాతీయ కార్యవర్గంలో తొలిసారిగా శ్రీకాకుళం వాసికి అవకాశం దక్కింది. యుగంధర్ నియామకం పట్ల పలువురు జిల్లా యువజన, విద్యార్థి, కమ్యూనిస్టు నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

## దేశం కోసం ప్రాణాలైనా ఇస్తాం



(సత్యంన్యూస్, ఆమదాలవలస)

ఎమ్మెల్యే కూన రవికుమార్ పిలుపు మేరకు ఆదివారం ఆమదాలవలస వన్‌వే దగ్గర ఉన్న మహాత్మాగాంధీ విగ్రహం నుంచి కృష్ణాపురం జంక్షన్ వరకు తిరిగి వన్‌వే జంక్షన్ వరకు భారతమాతాకి జై వందేమాతరం నినాదాలతో మాజీ సైనికుల తిరంగాయాత్ర సాగింది. దేశంలోని సైనికులకు మద్దతుగా అమరులైన సైనికులకు జోహార్ పలుకుతూ మన దేశ ప్రధాని తీసుకునే ఏ నిర్ణయానికైన కట్టుబడి ఉంటామని అవసరమైతే దేశం గురించి మళ్లీ సైనికులుగా మారి దేశం గురించి ప్రాణాలైనా ఇస్తామని మాజీసైనికులు అన్నారు. కార్యక్రమంలో మాజీ సైనికులతోపాటు మాజీ పారా మిలటరీ కూడా పాల్గొన్నట్లు జిల్లా మాజీ సైనికుల అధ్యక్షులు పూర్ణచంద్రరావు కటకం మీడియాకి తెలియజేశారు. కార్యక్రమంలో జిల్లా మాజీ సైనికుల అధ్యక్షులు పూర్ణచంద్రరావు కటకంతోపాటు ఆమదాలవలస ప్రెసిడెంట్ తాండ్ర జనార్ధనరావు, బర్రి సంజీవరావు, పేడాడ సూర్యారావు, బొడ్డేపల్లి శ్రీనివాసరావు, పైడి మురళీధరరావు, అన్నెపు మురళి, పప్పల రాజారావు, కూన జగన్నాథం, సూర అవతారం, జామి రమణయ్య, జి.రాజారావు, నానుపత్రుని రామారావు, పి.నాగభూషణం, సనపల సత్యనారాయణ, ఎమ్.గోపాలం, కిల్లి అప్పారావు, పేడాడ కృష్ణారావు, పొన్నాడ శ్రీనివాసరావు, బి.వి.ఎస్.రావు, పారా మిలటరీ నుంచి కిల్లి వెంకటరమణమూర్తి, డి.మన్మధరావు, సీహెచ్ రామారావు ఇంకా పెద్దసంఖ్యలో మాజీ సైనికులు హాజరయ్యారు.

### ఎయిడ్స్ మృతులకు ఇంటాక్ నివాళి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ఎయిడ్స్ వ్యాధి వలన మృతి చెందినవారికి ఇంటాక్ ఆధ్వర్యంలో ఆదివారం నివాళులర్పించారు. ఈమేరకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి కార్యాలయం నుంచి ప్రారంభమైన అంతర్జాతీయ ఎయిడ్స్ కొవ్వొత్తుల స్మారక ర్యాలీలో ఇంటాక్ ర్యాలీలో ప్రతినిధులు పాల్గొని నినాదాలు చేశారు. ఎయిడ్స్ వ్యాధి ద్వారా తమ ప్రాణాలను కోల్పోయిన వారికి మౌనం పాటించి శ్రద్ధాంజలి ఘటించారు. కార్యక్రమంలో ఇంటాక్ తరఫున నూక సన్యాసిరావు, కన్వీనర్ వావిలపల్లి జగన్నాథనాయుడు అదనపు కన్వీనర్ హారికప్రసాద్, సీనియర్ మెంబర్ కొమ్ము రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.





టాలీవుడ్ వివాదాల్లో మోస్ట్ ఇంట్రస్టింగ్ టాపిక్ సూపర్‌స్టార్ కృష్ణ గాన గంధర్వుడు బాలసుబ్రహ్మణ్యం మధ్య జరిగింది. కృష్ణ, బాలు చాలా సన్నిహిత మిత్రులు. ఇద్దరూ ఒకే టైమ్‌లో ఇండస్ట్రీలో ఎదిగారు. ఉన్నత స్థానాలకు చేరారు. ఇద్దరూ నాన్ కాంట్రవర్షియల్‌గా వెళ్లాలనే తపన ఉన్నవారే. అయితే వారి మధ్యే కొన్ని సంవత్సరాలు నిశ్శబ్ద యుద్ధం కొనసాగింది. కృష్ణకు బాలు పాట లేకుండా పోయింది. ఎందుకు? ఏం జరిగింది?

### అయితే అసలిద్దరి మధ్య ఏం జరిగింది?

**సూర్యచంద్ర టైమ్‌లో కృష్ణతో రెగ్యులర్‌గా సినిమాలు తీసే ఓ నిర్మాతతో బాలసుబ్రహ్మణ్యానికి చిన్న వివాదం జరిగింది. ఆ బ్యానర్ లో తనకు రావాల్సిన బకాయి గురించి కొంచెం గట్టిగా అడిగారాయన. విషయం కృష్ణ దగ్గరకు వెళ్లింది. నేరుగా బాలుకి ఫోన్ చేశారు. ఏమిటండీ డబ్బులిస్తే తప్ప పాడను అన్నారట, అనడమే కాదు కెప్టెన్ కృష్ణ టైమ్‌లో నాకివ్వాల్సిన బకాయి కూడా పంపండి అనేశారు. కృష్ణ నిర్మాత నుంచి బాలూకు రావాల్సిన బకాయి వచ్చేసింది. అలాగే బాలు కూడా కృష్ణకు బకాయిపడ్డ సొమ్ము పంపేశారు. అంతే ఆ క్షణం నుంచి మూడేళ్లు కలసి పనిచేయలేదు ఇద్దరూ. అలా చెడిన రిలేషన్స్ బాగుచేయడానికి నడుం బిగించిన రాజ్ కోటి స్వయంగా బాలుతో మాట్లాడారు. కృష్ణతో మాట్లాడిద్దాం అనుకున్నారు. అయితే కాదని బాలునే స్ట్రెయిట్‌గా తను కృష్ణను పద్మాలయా ఆఫీసులో కల్సి సారీ చెప్పబోయారు. అయితే ఆయన అవేవీ పట్టించుకోలేదు. అవేవీ తవ్వొద్దండీ మనం కల్సి పన్జేస్తున్నాం అంతే అని షేక్ హ్యాండ్ ఇచ్చి పంపేశారు. అలా తిరిగి కృష్ణకు బాలు పాడడం ప్రారంభమైంది. అభిమానులు పండగ చేసుకున్నారు. ఆ తర్వాత రాజ్ సీతారామ్ గాత్రం వినిపించలేదు. అలా ఓ నటుడికీ గాయకుడికీ మధ్య మొదలైన యుద్ధం శాంతియుతంగా ముగిసింది.**

# బాలూ-కృష్ణకు ఎక్కడ చెడింది?

సూపర్ స్టార్ కృష్ణ, గాన గంధర్వ బాలసుబ్రహ్మణ్యం ఇద్దరూ ఒకే సంవత్సరం అటూ ఇటూగా టాలీవుడ్‌కి ఎంట్రీ ఇచ్చారు. కృష్ణను ఆదుర్తి సుబ్బారావు తేనెమనసులు చిత్రం ద్వారా 1965లో పరిచయం చేశారు. సరిగ్గా ఆ తర్వాత సంవత్సరమే బాలసుబ్రహ్మణ్యాన్ని శ్రీశ్రీశ్రీ మర్యాద రామన్న చిత్రం ద్వారా ఎస్పీ కోదండపాణి తెరకెక్కించారు. నేనంటే నేనే సినిమాలో గుంతలకిడి గుమ్మ పాటతో కృష్ణకు బాలు పాడితేనే వింటాం అని ఆడియన్స్ తేల్చి చెప్పేశారు. బాబూ మూవీస్ బ్యానర్ మీద మూడో సినిమా అంతా కొత్తవారితో తీయాలని సంకల్పించారు ఆదుర్తి సుబ్బారావు. అందులో ఇద్దరు హీరోల్లో ఒక హీరో ఛాన్స్ కృష్ణను వరించింది. నిజానికి ఆ వేషం కోసం కృష్ణంరాజు కూడా తీవ్రంగా ప్రయత్నించారు. కానీ అదృష్టం కృష్ణనే వరించింది. కృష్ణ నటించిన రెండో సినిమా కన్నెమనసులు యావరేజ్ అయింది. దీంతో ఏం చేయాలో తోచని పరిస్థితి. అలాంటి సిట్యుయేషన్‌లో ప్రముఖ నిర్మాత డూండీ పిల్చి మల్లిఖార్జునరావు డైరక్షన్‌లో గూఢచారి 116 చేసే ఛాన్స్ ఇచ్చారు. అలా కృష్ణ దశ తిరిగింది. ఆ వెంటనే సాక్షి. ఇలా ఫామ్ లోకి వచ్చేశాడు. గూఢచారి 116లో డీరిడీరి పాట ఘంటసాల పాడరేమో అనే అనుమానించారు డూండీ. కానీ సంగీత దర్శకుడు చలపతిరావు నేను పాడిస్తా కదా అని ధైర్యం చెప్పి పాడించేశారు. నెల్లూరు జిల్లా కోనేటమ్మపేటకు చెందిన శ్రీపతి పండిరాధ్యుల బాలసుబ్రహ్మణ్యం ఇంజనీరింగ్ చదవడానికి చెన్నై వచ్చి గాయకుడుగా కూడా ప్రయత్నాలు చేశాడు. ఒక స్టేజ్ ప్రోగ్రాంలో బాలు పాట విన్న సంగీత దర్శకుడు కోదండపాణి తొలి అవకాశం ఇచ్చారు. పద్మనాభం బ్యానర్ లో వచ్చిన శ్రీశ్రీశ్రీ మర్యాదరామన్నలో ఏమీ ఈ వింత మౌనం అంటూ సాగే పాటలో తన గాత్రం వినిపించారు బాలు.

బాలు, కృష్ణలు ప్రవేశించే సమయానికి ఘంటసాల టాప్ పొజిషన్ లో ఉన్నారు. ఆయనకు సమీపంలో కూడా మరో గాయకుడు లేని పరిస్థితి. శోభన్ బాబు లాంటి కుర్ర హీరోలు కూడా తమకు ఘంటసాలతోనే పాడించమని ఒత్తిడి తెస్తున్న కాలమది. అలాంటి టైమ్ లో ఎంట్రీ ఇచ్చిన బాలసుబ్రహ్మణ్యం రాజబాబు తదితర కమేడియన్లకు పాడడంతోనే కథ నడపాల్సి వచ్చింది. డెభైల్లో ఘంటసాల అనారోగ్యం పాలవడం.. ఎక్కువ పాటలు పాడలేకపోవడం జరిగింది. ఆ టైమ్‌లో ఎన్.టి.ఆర్, ఎఎన్నార్‌లకి మాత్రమే ఘంటసాల పాడేవారు. క్రిష్ణ, శోభన్‌బాబు లాంటి హీరోలకు పాడేందుకు బాలుకు అవకాశాలు వచ్చేవి. అలా వచ్చిన అవకాశమే ఆస్తులు అంతస్తులులో ఒకటై పోదామా మమతల కోవెలలో.. అంటూ వచ్చిన పాట. అలాగే మహాబలుడులో విశాల గగనంలో చందమామ బాలుకు మంచిపేరు తెచ్చాయి. ఘంటసాల ఉన్నంతకాలం కెరీర్ సాఫీగా సాగించిన బాలసుబ్రహ్మణ్యానికి ఘంటసాల మరణించడంతో దెబ్బ తగిలింది. ఘంటసాల మరణం వల్ల ఎక్కువ నష్టపోయింది బాలూనే. అలాంటి క్లిష్ట పరిస్థితుల్లో తనకు వెన్నుదన్నుగా నిలబడి ఏం పర్వాలేదు అని ధైర్యం చెప్పి ముందుకు నడిపించినవాడు సూపర్‌స్టార్ కృష్ణ. ఘంటసాల సంగీత దర్శకత్వంలో వచ్చిన ఆలీబాబా నలభై దొంగలు సినిమాలో భామలో చందమామలో అనే పాటలో ఘంటసాలతో గొంతు కలిపారు బాలసుబ్రహ్మణ్యం. ఆ తర్వాత ఏకవీరలో ప్రతిరాత్రి వసంతరాత్రి అంటూ ఘంటసాలతో కలిసిపాడారు. ఈ రెండు పాటలూ సూపర్ హిట్టు. ఆ తర్వాత ఇద్దరుమిత్రులులో ఎన్నాళ్లో వేచిన ఉదయం పాటలో మరోసారి ఘంటసాలతో స్వరం కలిపారు బాలు. ముందు శోభన్ బాబుకు, ఘంటసాల కృష్ణకు బాలు అనుకున్నారు కోదండపాణి. తీరా స్టూడియోకి వెళ్లాక సీన్ మారింది. కృష్ణ పోర్షన్ రఫ్ గా పాడాల్సి రావడంతో ఘంటసాలే పాడేశారు. ఘంటసాల సంగీత దర్శకత్వంలో తులసి చిత్రం కోసం సెలయేటి గలగలా అనే డ్యూయట్‌ను సుశీలతో కల్సి పాడారు బాలు. సరిగ్గా ఇటువంటి సమయంలోనే ఘంటసాల కన్నుమూశారు. ఇది చలన చిత్ర పరిశ్రమకు పెద్ద షాక్. ఘంటసాల మరణంతో ఎన్.టి.ఆర్ పాటలు లేని పాత్రలు చేస్తూ రావాల్సి వచ్చింది. నిప్పులాంటి మనిషి, అన్నదమ్ముల అనుబంధం చిత్రాల్లో రామారావుకు పాటలు ఉండవు. ఘంటసాలను పోలిన గాత్రంతో రామకృష్ణ అప్పటికే ఎంట్రీ ఇచ్చారు. దీంతో అక్కినేని, శోభన్ బాబు, కృష్ణంరాజు లాంటి హీరోలందరూ రామకృష్ణతోనే పాడించుకోవడం ప్రారంభించారు. బాలు కేవలం కమెడియన్స్‌కు మాత్రమే పాడుకుంటూ కాలం వెల్లదీయాల్సి వచ్చింది. అలాంటి పరిస్థితిలో బాలుకు ధైర్యం చెప్పింది సూపర్‌స్టార్ కృష్ణ. ఎవరు ఎవరితో పాడించుకున్నా పర్లేదు. మీ వాయిస్ నాకు సెట్ అయింది. దీన్ని మార్చాల్సిన అవసరం లేదు. నా సినిమాలకు మీరు మాత్రమే పాడండి అని బాలును ప్రత్యేకంగా కోరారు కృష్ణ. సంవత్సరానికి నాలుగైదు సినిమాలు ఉంటాయనే భరోసా కూడా కల్పించారు. ఇంత చేసి ఒకటే కోరిక కోరారాయన. అదేంటంటే కమేడియన్స్ కు పాడకుండా ఉంటే మంచిదనేది. ఈ కోరికను బాలు తీర్చలేదు గానీ బాలుకు అవకాశాలు మాత్రం వచ్చాయి. అక్కినేని ఆలుమగలు సినిమా టైమ్ లో సంగీత దర్శకుడు తాతినేని చలపతిరావు ఓ సలహా చెప్పారు బాలుకి. రామారావు, నాగేశ్వర్రావులకు పాడి మెప్పించాలంటే రెండే మార్గాలు. ఒకటి ఘంటసాలను ఇమిటేట్ చేయడం.. రెండు నేరుగా ఆ నటులనే ఇమిటేట్ చేయడం. ఈ రెంటిలో రెండోదే బెస్ట్ అనుకున్నాడు బాలు. ఘంటసాలను ఇమిటేట్ చేసిన రామకృష్ణ వెనకతట్టు పట్టి, స్వంత గళం వినిపించిన బాలు సెటిలైపోయాడు. సూపర్‌స్టార్ కృష్ణ, బాల సుబ్రహ్మణ్యం మంచి మిత్రులనే ఇండస్ట్రీలో పేరు పడింది. ఆ తర్వాత చాలా కాలానికి డెభ్బై దశకంలోనే కృష్ణ హీరోగా కె.ఎస్.ఆర్ దాస్ దర్శకత్వంలో కెప్టెన్ కృష్ణ సినిమా వచ్చింది. ఆ సినిమా నిర్మాతలు బాలసుబ్రహ్మణ్యానికి సన్నిహితులు. బాలు ఆ మూవీకి సమర్పకుడుగా వ్యవహరించారు.

ఇలా నడుస్తున్న స్నేహం మధ్యలో తెగిపోయింది. కారణం ఏమిటి చూద్దాం. రమేష్ నాయుడు సంగీత దర్శకత్వంలో వచ్చిన సూర్యచంద్ర చిత్రంలో రాజ్ సీతారాం అనే గాయకుడు కృష్ణకు పాడాడు. అది జస్ట్ ప్రయోగం అనుకున్నారంతా. తీరా చూస్తే ఆ తర్వాత కృష్ణ డైరక్షన్ లో వచ్చిన మెగా మూవీ సింహాసనంలో పాటలు కూడా రాజ్ సీతారామే పాడడంతో బాలు కృష్ణల మధ్య చెడిందనే మాట ప్రచారం అయింది. 1985 అక్టోబర్ ప్రాంతంలో మొదలైన ఈ వివాదం 1988 వరకు కొనసాగింది. సూర్యచంద్ర సినిమాతో మొదలైన ఎడబాటు విజయబాపినీడు డైరక్షన్ లో వచ్చిన మహారాజశ్రీ మాయగాడు వరకు కొనసాగింది. మహారాజశ్రీ మాయగాడు చిత్రానికా లేక రౌడీ నంబర్ ఒన్ కో గానీ సంగీత దర్శకత్వం వహించిన రాజ్ కోటి పట్టుపట్టి కృష్ణ బాలును కలిపారు.

- రంగావఝ్జుల భరద్వాజ

## గుర్తు తెలియని మృతదేహం లభ్యం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)



పొన్నాడ పంచాయతీలో ఉన్న ధనుం జయరావు మెకానిక్ షాప్ ప్రక్కన ఉన్న పొలంలో ఎవరో గుర్తుతెలియని మృతదేహం ఉంది. ఈయనకు సుమారు 35 నుండి 40 సంవత్సరాలు ఉంటాయి. ఈయన నీలం రంగు షర్ట్, నలుపు రంగు లోయర్ వేసుకొని ఉన్నారు, ఒక జేబులో ఆంప్లిఫైర్ జాక్స్ ఉన్నాయి. ఎవరికైనా తెలిసిన యెడల 6309990853 6309990816 నంబర్లకు తెలియజేయగలరు.

## లేబర్ కోడ్‌లను వ్యతిరేకించండి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

కార్మికవర్గాన్ని కార్పొరేట్లకు బానిసలుగా మార్చే కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్ లకు వ్యతిరేకంగా ఐక్య పోరాటాలను నిర్మించడమే పుచ్చలపల్లి సుందరయ్యకు అర్పించే ఘన నివాళులని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు అన్నారు. పుచ్చలపల్లి. సుందరయ్య 40వ వర్ధంతి సభ అరిణాంక్కివలస వద్ద గల ఎన్‌ఏసిఎల్ ఇండస్ట్రీస్ పరిశ్రమ వద్ద జరిగింది. అనంతరం జరిగిన వర్ధంతిసభలో ఆయన మాట్లాడుతూ పుచ్చలపల్లి సుందరయ్య పార్లమెంటులోను, రాష్ట్ర అసెంబ్లీలోనూ ప్రజాసమస్యలపై, దేశాభివృద్ధికై, నదీజలాలు వినియోగంపై, వివిధ అంశాలపై రాజకీయ ప్రత్యర్థులు సైతం ప్రశంసించేరీతిలో విస్తృత చర్చలు జరిపిన బహుముఖ ప్రజ్ఞశాలి అని కొనియాడారు. సామాన్య రైతు, కార్మికుల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేసారన్నారు. స్త్రీల సమానత్వం కోసం, కులవివక్షకు వ్యతిరేకంగా, సామాజిక న్యాయానికి కృషి చేశారన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో కీలకపాత్ర పోషించారన్నారు. ఆంధ్రప్రదేశ్‌లోనూ, దక్షిణ భారతదేశంలో కమ్యూనిస్టు ఉద్యమాన్ని నిర్మించి బలోపేతం చేశారన్నారు. సుందరయ్య పార్లమెంటులో మొదటి ప్రతిపక్ష నేతని, పార్లమెంట్‌కి సైతం సైకిల్ పై వెళ్లిన నిరాడంబరుడన్నారు. సంపన్న కుటుంబంలో పుట్టిన సుందరయ్య తన వాటాగా వచ్చిన భూమిని, ఆస్తులు సర్వస్వం కష్టజీవుల ఉద్యమాలకే ధారపోసిన ఉత్తమ కమ్యూనిస్టు అన్నారు. కార్యక్రమంలో నాగార్జున అగ్రికం స్టాఫ్&వర్కర్స్ యూనియన్స్ నాయకులు లింగాల రామప్పడు, మాన్యం రమణ, అంబటి సత్యనారాయణ, టి.రవికుమార్, ఎల్.వరదరాజు, చిక్కాల సత్యనారాయణ, ఎస్.పరశురామ్ తదితరులు పాల్గొన్నారు



## విద్యార్థులు పోటీ తత్వాన్ని అలవర్చుకోవాలి



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

విజ్ఞాన గ్రంథాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని బలగ గ్రంథాలయ అధికారి పి. ఉగ్రసేను అన్నారు బలగ హడ్కో కాలనీలో గల శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా సోమవారం ప్రాచీన భారతదేశము, విజ్ఞాన గ్రంథాలపై అవగాహన కల్పించారు భారతదేశం ఎల్లలు స్థితిగతులు నైసర్గిక స్వరూపము గురించి వివరించారు ప్రాచీన గ్రంథాలు లోని విజ్ఞానము విద్యార్థులకు అర్థమయ్యే విధంగా వివరించారు మరియు శ్రీకాకుళం జిల్లా నైసర్గిక స్వరూపం మ్యాప్ ద్వారా చెప్పడం జరిగింది ఈ కార్యక్రమంలో సహాయకురాలు కె .అనిత విద్యార్థులు పాల్గొన్నారు

## జూన్ 1న ఉచిత మోడల్ లాసెట్

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

జూన్ 1న ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఆంధ్రప్రదేశ్ బీసీ న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో శ్రీకాకుళం నగరంలోని ఎం.పి.ఆర్ లా కాలేజీలో ఉచిత మోడల్ లాసెట్ నిర్వహించనున్నట్లు ఆంధ్రప్రదేశ్ బీసీ న్యాయవాదుల సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆగూరు ఉమా మహేశ్వర రావు, చౌదరి లక్ష్మణ రావు తెలిపారు. సోమవారం వారు ఎం.పి.ఆర్ లా కాలేజీలో ప్రిన్సిపాల్ కె.మోషేతో కలిసి విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఉచిత మోడల్ లాసెట్‌కు ఎటువంటి రుసుము చెల్లించనవసరం లేదన్నారు. ఐదేళ్ళ, మూడేళ్ల లా కోర్సుల కోసం దరఖాస్తు చేసిన వారు ఈ ఉచిత మోడల్ లాసెట్ రాయవచ్చునని వారు తెలిపారు. కార్యక్రమంలో బీసీ న్యాయవాదుల సంఘం సీనియర్ సభ్యులు కూన కనవయ్య పాల్గొన్నారు. మోడల్ లాసెట్ జనరల్ నాలెడ్జ్, నూతన న్యాయ చట్టాలు, లీగల్ అంశాలపై ఉంటుందన్నారు. ఇతర వివరాలకు చౌదరి లక్ష్మణరావు (9640780728)ను సంప్రదించవచ్చునన్నారు.



## ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా




(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వానికి విన్నవించి పరిష్కారానికి కృషి చేయాలని ఎంటీఎస్ టీచర్లు ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులునాయుడును కోరారు. దీనిపై ఆయన స్పందిస్తూ తప్పకుండా ప్రభుత్వం న్యాయం చేసేందుకు తనవంతు ప్రయత్నం చేస్తానని హామీ ఇచ్చారు. అరసవల్లి పీఆర్‌టీయూ భవన్ లో ఆదివారం 98 డీఎస్సీ ఎస్‌జీటీ (ఎంటీఎస్) ఉపాధ్యాయుల సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ శ్రీనివాసులు నాయుడును ఈ సందర్భంగా ఘనంగా సన్మానించారు. అనంతరం ఉపాధ్యాయుల సమస్యలు ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. సమావేశంలో జిల్లా పీఆర్‌టీయూ నాయకులతో పాటు ఎస్.రాజగోపాలనాయుడు, సీహెచ్ మల్లేశ్వరరావు, డివిఎన్ పట్నాయక్, సాయిబాబా, జి.నారాయణరావు, జె.శ్యాంసుందర్ తదితరులు పాల్గొన్నారు.

## నందమూరి అభిమానులు సేవా తత్పరులు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

నందమూరి అభిమానులు సేవా తత్పురుషులని, ఎన్టీఆర్ అభిమానులు చేస్తున్న సేవలు అభినందనీయమని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. జూనియర్ ఎన్టీఆర్ 42వ జన్మదినం సందర్భంగా నగరంలో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న విషయం విదితమే. ఇందులో భాగంగా శ్రీకాకుళం శాసనసభ్యులు గొండు శంకర్ స్థానిక సరస్వతి థియేటర్ వద్ద ఎన్టీఆర్ అభిమానుల మధ్య కేక్ కట్ చేశారు. అనంతరం మాట్లాడుతూ యంగ్ టైగర్ జూనియర్ ఎన్టీఆర్ చేస్తున్న చిత్రాలు ఆలోచింపజేస్తాయని, రాష్ట్ర నలుమూలల ఉండే ఆయన అభిమానులు చేస్తున్న సేవలు వర్ణించలేనివన్నారు. ఉచితవైద్య శిబిరాలు, రక్తదాన శిబిరాలు, అన్నదానాలు, చలివేంద్రాలు, క్రీడాపోటీలు, పేద వారికి ఆపన్నస్థులుగా నిలుస్తున్నారని ఆయన తెలియ జేశారు. శ్రీకాకుళం జిల్లా జూనియర్ ఎన్టీఆర్ ఫ్యాన్స్ అధ్యక్షులు, స్టేట్ వైడ్ ఎన్టీఆర్ ఫ్యాన్స్ కన్వీనర్ దుంగ శ్రీధర్ ఆధ్వర్యంలో పట్టణ ఎన్టీఆర్ ఫ్యాన్స్ అధ్యక్షులు, శ్రీకాకుళం జిల్లా కళ్యాణ్‌రామ్ ఫ్యాన్స్ అధ్యక్షులు స్టేట్ వైడ్ కన్వీనర్ బుర్రి మధు ఆధ్వర్యంలో ఎన్టీఆర్ జన్మదినాన్ని వారం రోజులపాటు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ అభిమానం చాటుకున్నారని, సేవలకు చిరునామాగా ఎన్టీఆర్ ఫ్యాన్స్ బృందం నిలుస్తుందన్నారు. దుంగ శ్రీధర్, మధు మాట్లాడుతూ తమ అభిమాన నటుడు జూనియర్ ఎన్టీఆర్ జన్మదినం సందర్భంగా జిల్లాలో నాలుగు రోజులపాటు సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. దీనిలో భాగంగా సోమవారం మధ్యాహ్నం యాచకులకు అన్నదానం నిర్వహించామన్నారు. 20న బెహరా మనోవికాస కేంద్రంలో అనాథ పిల్లలకు అల్పాహారం ఏర్పాటు చేస్తున్నామని సామాజిక సేవ ఒక బాధ్యతగా తీసుకున్నామని, జూనియర్ ఎన్టీఆర్ పేరిట ఉభయ తెలుగు రాష్ట్రాలలో ఎన్నో సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారన్నారు. సరస్వతి థియేటర్ మేనేజర్ చిన్నరాజు, శ్రీకాకుళం జిల్లా ఎన్టీఆర్ ఫ్యాన్స్ ఉపాధ్యక్షులు పి.గోవిందరావు, పి.శ్రీనివాసరావు, బొట్ట కామరాజు, వై.ప్రసాద్, బాడీబిల్డర్ విజయ్, యు.గంగరాజు, అంధవరపు శ్రీనివాసరావు, శ్రీనివాస కార్తిక్, సతీశ్, కె.లక్ష్మణ్‌రెడ్డి, బాస్కర్, ఈశ్వర్, ఇంటి శంకర్, సీహెచ్ రమణ, కరణం సురేష్‌కుమార్ సుభాష్ చౌదరి, జగదీష్, మట్ట రాజు, అల్లక మల్లికార్జున, టీం తారక్ ట్రస్ట్ సభ్యులు వాసుపల్లి నరసింహమూర్తి, మోఖర షణ్ముఖ, నేతాజీ, ప్రకాష్, సురేష్, తారక్, పోలీస్ యంగ్‌టైగర్ ఎన్టీఆర్ అభిమానులు, నందమూరి అభిమానులు పాల్గొని ఎన్టీఆర్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.



## తెలుగుభాషపై పట్టు సాధించాలి



(సత్యంన్యూస్, లావేరు)

విద్యార్థులు తెలుగు భాషపై పట్టు సాధించాలని రిసోర్స్‌పర్సన్ ఎం.శంకరరావు అన్నారు. వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా సోమవారం లావేరు శాఖా గ్రంథాలయంలో తెలుగు భాష, వ్యాకరణం గురించి విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయాధికారి మురపాక శ్రీనివాసరావు, గ్రంథాలయ సహాయకులు టి.వీరభద్రుడు, పాఠకులు విద్యార్థులు పాల్గొన్నారు.

**ప్రతి విద్యార్థి ఒక మొక్క నాటాలి**

ప్రతి విద్యార్థి ఒక మొక్క నాటాలని గ్రంథాలయాధికారి శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం లావేరు శాఖా గ్రంథాలయంలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి పుట్టినరోజున గ్రంథాలయానికి వచ్చి ఒక మొక్క నాటడంతో పాటు వాటి సంరక్షణ చూడాలన్నారు.

## పుచ్చలపల్లి ఆశయ సాధనకు కృషి చేయాలి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

స్వతంత్ర సమరయోధుడు దక్షిణ భారత దేశ కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత తొలి పార్లమెంట్ ప్రతిపక్ష నేత కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య ఆశయ సాధనకు అందరూ కృషి చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు కార్యదర్శివర్గ సభ్యులు బి.కృష్ణమూర్తి పిలుపునిచ్చారు. సోమవారం స్వతంత్ర సమరయోధుల స్మృతి వనంలో సుందరయ్య విగ్రహానికి పూలమాల వేశారు అదేవిధంగా సిపిఎం కార్యాలయంలో సుందరయ్య గారి చిత్రపటానికి పూలమాల వేశారు అనంతరం జరిగిన సభలో వారు మాట్లాడుతూ సుందరయ్య తన యావత్ జీవితాన్ని ప్రజాపోరాటాలకు అంకితం చేసిన మహాయోధుడని కొనియాడారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పోరాటాలు చేయడమే ఆయనకు మనమిచ్చిన ఘనమైన నివాళులన్నారు. కేంద్రంలో బీజేపీ దేశసంపదను, ప్రజల ఆస్తులను ప్రకృతి వనరులను కార్పొరేట్ ఆస్తిగా మార్చేస్తుందని విమర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఉద్యమాలు ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు. లేబర్ కోడ్స్ వ్యతిరేకంగా జూలై 9 సమ్మెకు సిపిఎం పార్టీ తన సంపూర్ణ మద్దతు ఉంటుందన్నారు. కార్యక్రమంలో అల్లు సత్యనారాయణ, ఆర్.ప్రకాశరావు, ఎంవీ కామేశ్వరరావు, ఎం.ప్రభాకరరావు, కొత్తకోట అప్పారావు, సత్తారు భాస్కరరావు, అల్లు సోమశేఖర్, ఎ.లక్ష్మి ఎల్.మహేష్, కె.సూరయ్య, ఎం.గోవర్ధన్, ప్రవీణ్, పి.సుధాకర్, చింతాడ రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.



## సిక్కోలు ఖ్యాతికి చిహ్నం బాడీబిల్డర్స్

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

**మిస్టర్ ఆంధ్ర పోస్టర్ ఆవిష్కరణ చేసిన ఎమ్మెల్యే గొండు శంకర్**

సిక్కోలు ఖ్యాతికి చిహ్నం బాడీ బిల్డర్స్ అని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. మిస్టర్ ఆంధ్ర జోనల్ బాడీ బిల్డింగ్, ఛాంపియన్షిప్ ఈనెల 20వ తేదీన అంబేద్కర్ ఆడిటోరియంలో ఆరు జిల్లాల బాడీ బిల్డింగ్ పోటీలు జరగనున్నాయి. శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ పోస్టర్ ఆవిష్కరణ చేసి మాట్లాడుతూ సిక్కోలులో క్రీడాకారులకు కొదవలేదని, క్రీడాకారులు ఎంతో కష్టపడతారని, అందుకు తగ్గట్టుగానే పతకాలు సాధించటం హర్షణీయమన్నారు. ఈ పోటీల్లో పాల్గొన్న బాడీ బిల్డర్‌కి బోజనవసతితోపాటు, 57 వేల రూపాయల నగదు బహుమతి అందించనున్నారని, బాడీ బిల్డింగ్ పోటీలు శ్రీకాకుళంలో ఏకధాటిగా 12వసారి ఏర్పాటు చేయడం జరిగిందని, స్టార్ బాడీ బిల్డర్స్ ప్రధాన కార్యదర్శి వి.విజయకుమార్ విజయవంతమైన క్రీడాకారులను తయారు చేస్తున్నారని, ప్రత్యేక అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో శ్రీకాకుళం జిల్లా జూనియర్ ఎన్టీఆర్ ఫ్యాన్స్ అధ్యక్షుడు దుంగ శ్రీధర్, కళ్యాణ్‌రామ్ ఫ్యాన్స్ అధ్యక్షుడు, కన్వీనర్ బుర్రి మధు, సరస్వతి థియేటర్ మేనేజర్ చిన్న రాజు, శ్రీకాకుళం జిల్లా ఎన్టీఆర్ ఫ్యాన్స్, ది ఆంధ్ర బాడీబిల్డర్స్ అసోసియేషన్ సభ్యులు, చీఫ్ వెటరన్ బి.దేవభూషణ్, బలగ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.



## ఉచిత వైద్యశిబిరానికి భారీ స్పందన

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

స్థానిక పెద్దరెల్లి వీధిలో ఉన్న డిస్ట్రిక్ట్ ఎక్స్ సర్వీసు మెన్ ఫెడరేషన్ శ్రీకాకుళం బిల్డింగ్ ఆవరణలో మెడికవర్ హాస్పటల్ వారి సౌజన్యంతో ఉచిత మెడికల్ క్యాంప్ నిర్వహించినట్లు జిల్లా మాజీ సైనికుల అధ్యక్షులు కటకం పూర్ణచంద్రరావు పేర్కొన్నారు. ఈ ఉచిత వైద్య శిబిరంనకు మంచి స్పందన వచ్చిందని, ఇది చాలా సంతోషించదగ్గ విషయమన్నారు. జిల్లాలో మొదటిసారిగా మాజీ సైనికుల ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించడం, ఈ శిబిరాన్ని మాజీ సైనికులు, వారి కుటుంబసభ్యులు కూడా వినియోగించుకోవడం హర్షణీయమైనదన్నారు. ఈ వైద్య శిబిరంలో ఉచిత షుగర్, బీపీ, ఈసీజీలు తీయడంతోపాటు అవసరమైన మందులు కూడా ఉచితంగా అందించారన్నారు. ఎవరికైనా అవసరం అనిపిస్తే మెడికవర్ తరుపున ఉచిత కూపన్లు కూడా అందజేశామని వివరించారు. 40 మంది వరకూ ఈ ఉచిత వైద్య శిబిరంను ఉప యోగించుకున్నట్లు తెలియజేశారు. ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని మధ్యాహ్నం ఒంటిగంటన్నరకే ఈ శిబిరాన్ని ముగించామని తెలిపారు. అనంతరం ఉచిత వైద్య సేవ చేసిన మెడికవర్ హాస్పటల్ వైద్యులకు, సిబ్బందిని సత్కరించారు.



## ప్రజాకవి కలేకూరి ప్రసాద్ వర్ధంతి



(సత్యంన్యూస్, విజయనగరం)

ప్రజాకవి కలేకూరి ప్రసాద్ వర్ధంతిని విజయనగరంలో పాటల తూట అతవ ఉదయ్ భాస్కర్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా బీసీ సంక్షేమ సంఘం తరపున శ్రీకాకుళం జిల్లా బీసీ సంక్షేమ సంఘం ఆర్గనైజింగ్ కార్యదర్శి బొచ్చెన రాజేష్‌కుమార్‌ను సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు కంఠ వేణు, యజ్జల గురుమూర్తి, రాంబాబు, మెహన్, అప్పారావు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



వేసవి శిబిరంలో భాగంగా పాలకొండ శాఖా గ్రంథాలయంలో 22వ రోజు పిల్లలకు ఎంపీయూపీ స్కూల్ ప్రధానోపాధ్యాయులు వి.మల్లేశ్వరరావు హాజరై నీతికథలు చెప్పారు. అధిక సంఖ్యలో పిల్లలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ గ్రంథాలయ అధికారి బబ్బురు గణేష్ బాబు, సహాయకుడు ఈశ్వర్ పాల్గొన్నారు.

– సత్యంన్యూస్, శ్రీకాకుళం



## షర్మిల వైఖరి అధిష్టానానికి చేర్చాలి / విశాఖపట్నంలో సమావేశమైన కాంగ్రెస్ శ్రేణులు

(సత్యంన్యూస్, విశాఖపట్నం)

రాష్ట్రవ్యాప్తంగా గత సంవత్సర కాలంగా పీసీసీ అధ్యక్షులు షర్మిలారెడ్డి నాయకత్వంపై తీవ్ర అసంతృప్తితో ఉన్న రాష్ట్ర కాంగ్రెస్ శ్రేణులు విశాఖపట్నంలోని ఒక ప్రైవేట్ హోటల్‌లో సోమవారం సమావేశమయ్యారు. రాష్ట్ర పీసీసీ మాజీ వర్కింగ్ ప్రెసిడెంట్ సుంకరి పద్మశ్రీ, అనకాపల్లి మాజీ డీసీసీ అధ్యక్షులు శ్రీరామ్మూర్తి నాయకత్వంలో జరిగిన ఈ సమావేశానికి విజయనగరం మాజీ డీసీసీ అధ్యక్షులు సరగడ రమేష్‌కుమార్ అధ్యక్షత వహించారు. కేంద్ర మాజీమంత్రి డాక్టర్ కిల్లి కృపారాణి సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సమావేశంలో పాల్గొన్న 26 జిల్లాలకు చెందిన పలువురు మాజీ డీసీసీ అధ్యక్షులు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, వివిధ అనుబంధ విభాగాల రాష్ట్ర, జిల్లా అధ్యక్షులు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలి నిరంకుశత్వంతో నేడు రాష్ట్రంలో గడ్డు పరిస్థితి ఎదుర్కొంటోందని, ఎన్నికలు జరిగిన నాటి నుంచి నేటివరకు రాష్ట్రంలో పార్టీ విధ్వంశానికి పీసీసీ నాయకత్వం కృషి చేస్తోంది తప్ప పార్టీ అభివృద్ధికి పని చేయడంలేదని వారు ధ్వజమెత్తారు. ఈ విషయాలన్నింటినీ ఏఐసీసీ అధ్యక్షులు మల్లిఖార్జున్ ఖర్గే, కాంగ్రెస్ పార్టీ జాతీయ నాయకులు రాహుల్‌గాంధీ, సోనియాగాంధీలకు తెలియజేయాలని శ్రీకాకుళం డీసీసీ మాజీ అధ్యక్షులు పేడాడ పరమేశ్వరరావు చేతుల మీదుగా అన్ని జిల్లాల నుంచి వినతిపత్రాలను కృపారాణికి అందజేశారు.

## శ్రీ మద్ది ఆంజనేయ స్వామికి అష్టోత్తర పుస్తకార్చన



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ఏలూరు జిల్లాలోని జంగారెడ్డిగూడెం దరి గుర వాయిగూడెంలో గల 12వ శతాబ్దానికి ముందు గల శ్రీమద్ది ఆంజనేయ స్వామి ఆలయంలో అష్టోత్తర పుస్తకార్చన నిర్వహించారు. కాశిన వెంకటేశ్వరరావు, రమణమ్మ దంపతులు తమ స్వీయ రచనగా అభయ ప్రసన్న మారుతి అనే 108 పుస్తకాలతో విశ్వజయము గ్రూప్ సభ్యుల శ్రేయస్సు కోసం మద్దిచెట్టు తొర్రలో వెలసియున్న స్వామి వారికి అర్చన జరిపించి, వాటిని భక్తులకు వితరణ చేయమని ఆలయ ఈవో ఆర్వీ చందనకు అందజేశారు. ఈ పుస్తకంలో పురాణ ప్రసిద్ధ, సుప్రసిద్ధ, విచిత్ర, అద్భుత, ఎత్తైన విగ్రహాలు గల స్వామికి చెందిన 108 ఆలయాల విశేషాలను, స్వామి చరిత్ర, ఆరాధనా స్తోత్రాలను పొందుపర్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ మోహనకృష్ణ, స్థానాచార్యులు వేదాంతం రంగప్రసాద్, అర్చకులు శ్రీనివాసాచార్యులు, పవన్‌కుమార్, సూర్యనారాయణాచార్యులు, భక్తులు వెంకటేశ్వరరావు, లావణ్య దంపతులు పాల్గొన్నారు.

## రిజర్వు స్థలంలో ఆక్రమణలు తొలగించండి

### - కలెక్టర్‌కు నరసన్నపేట మహిళలు విన్నపం



సత్యంన్యూస్, శ్రీకాకుళం

లే-అవుట్‌లోని రిజర్వు స్థలంలో అక్రమణలను తొలగించాలని సోమవారం జెడ్పీలో కలెక్టర్ నిర్వహించిన గ్రీవెన్స్‌లో నరసన్నపేట గాంధీనగర్ నాలుగో లైన్‌కు చెందిన మహిళలు విన్నవించారు. ఈమేరకు అక్రమణదారులపై ఫిర్యాదు చేశారు. 1980లో వైశ్యరాజు రామరాజు తదితరులు బొడ్డవలస రెవెన్యూ పరిధిలో సర్వే నెంబర్ 36లో వేసిన అప్రూవల్ లేఅవుట్‌లోని రిజర్వ్ స్థలంలో అక్రమ నిర్మాణాలను తొలగించాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. 30 ఏళ్ల క్రితం వేసిన లే-అవుట్‌లో స్థిరనివాసం ఏర్పాటు చేసుకొని నివాసం ఉంటున్నామని కలెక్టర్‌కు వివరించారు. లేఅవుట్ నిబంధనలకు లోబడి 10 శాతం రిజర్వు స్థలాన్ని విడిచిపెట్టామని, దీన్ని ఆటస్థలంగా, కాలనీవాసుల ఉమ్మడి అవసరాలకు వినియోగిస్తున్నట్టు వివరించారు. యార్డు స్వచ్ఛంద సంస్థలో పనిచేస్తున్న పోలాకి మండలం కూన నరసింహస్వామి స్వచ్ఛంద సంస్థకు చెందిన ఆస్థితో పాటు కాలనీలో ఉన్న రిజర్వు స్థలాన్ని ఆక్రమించి నిర్మాణాలు చేపట్టడానికి ప్రయత్నాలు చేస్తున్నట్టు వివరించారు. దీనిపై పంచాయతీ ఈవోకు ఫిర్యాదు చేసినా అక్రమణదారుడు రాజకీయ పరపతితో రిజర్వు స్థలంలో సుమారు 5 సెంట్ల దురాక్రమణకు ప్రయత్నిస్తున్నట్టు ఫిర్యాదులో పేర్కొన్నారు. సదరు రిజర్వు స్థలం దురాక్రమణ కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. భవిష్యత్తులో రిజర్వు స్థలంలో పార్కు నిర్మించడానికి వీలుగా స్థలం చుట్టూ కాలనీవాసులంతా కలిసి ప్రహరీ నిర్మించేందుకు అవకాశం కల్పించాలని కలెక్టర్‌ను కోరారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో ఎం.గీతారాణి, ఎల్.ఇందిర, జి.భారతీ, ఎస్.ఝాన్సీ, ఎస్.భారతీ, కె.పావనీ తదితరులు ఉన్నారు.

## నర'సన్న బడిన' చెరువు



(మొదటిపేజీ తరువాయి)

ఆక్రమణల గుప్పిట్లోకి వెళ్లిపోయింది. కళాశాల రోడ్డు, జాతీయ రహదారి వైపు ఆక్రమణల జోరుగా సాగుతున్నాయి. చెరువుకు ఆనుకొని ఉన్న పచోరీ కాలనీ వైపు ఆక్రమణలకు సిద్ధమైపోయారు. నలువైపులా చెరువు గర్భంలో రాళ్లు, మట్టితో నింపి ఎత్తు చేసుకుని నిర్మాణాలకు అనుకూలంగా మార్చుకుంటున్నారు. మొదట కార్‌స్టాండ్ కోసం 2 సెంట్లు అధికారికంగా ప్రజాప్రతినిధుల సూచనలతో అధికారులు కేటాయించారు. ఆ తర్వాత నెమ్మదిగా చెరువంతా ఆక్రమించుకున్నారు. పట్టణం నడిబొడ్డున ఉన్న చెరువు కావడంవల్ల ఎవరికి నచ్చినట్టు వారు డెబ్రిస్‌తో కప్పి ఆక్రమించుకుంటున్నారు. రెవెన్యూ, పంచాయతీ అధికారులకు సమాచారం ఇచ్చినా స్పందించడం లేదని స్థానికులు చెబుతున్నారు. స్థానిక ఎంఎల్ఆర్ కళాశాల రోడ్డు వైపు చెరువు గర్భంలోకి ఆక్రమణదారులు రాత్రివేళలో డెబ్రిస్‌ను తరలించి ఎత్తు చేస్తున్నారు. కారు, ఆటో స్టాండ్ కోసం చెరువులో కొంత భాగాన్ని ఎత్తు చేసి పార్కింగ్‌కు అవకాశం కల్పించిన తర్వాత చెరువు ఆక్రమించుకోవడం వేగవంతమైంది. కాంప్లెక్స్ ప్రాంతాల్లో విశాలమైన నరసన్న చెరువు ప్రస్తుతం ఒక మురుగు కాలువలా మిగిలిపోయిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అక్రమణలపై చర్యలు తీసుకోకుంటే మరి కొద్దిరోజుల్లో చెరువు కనుమరుగవుతుందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వ ఆస్తులను, చెరువులను పరిరక్షించాల్సిన అధికారులు అక్రమార్కుల వైపు దృష్టి సారించడం లేదని విమర్శలున్నాయి. భవిష్యత్తు అవసరాలకు ప్రజాప్రతినిధులు, రెవెన్యూ, పంచాయతీ అధికారులు చెరువు ఆక్రమణపై దృష్టి సారించి చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.



## విజయనగరంలో ఉగ్రమూలం..

# శ్రీకాకుళంతో బంధుత్వం

మొదటిపేజీ తరువాయి

పక్కమతాన్ని పూర్తిగా భరించలేని నైజంతో గడుపుతున్న వారి సంఖ్య తక్కువేమీ కాదు. ఇప్పుడు విజయనగరం వరకు ఉగ్రమూలాలు రావడం వల్ల శ్రీకాకుళంపై కూడా కన్నేయాల్సిన అవసరం ఏర్పడింది. విజయనగరంలో ఉగ్రమూలాల కేసు విచారణలో పోలీసులు జోరు పెంచారు. ఈ కేసులో నిందితులుగా ఉన్న సిరాజ్, సమీర్ కస్టడీ కోసం కోర్టులో పోలీసులు పిటిషన్ దాఖలు చేశారు. ఇద్దరినీ కస్టడీకి ఇస్తే మరిన్ని విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది. నిందితులకు నిధులు ఎవరు సమకూర్చారన్న కోణంలో పోలీసులు విచారిస్తున్నారు. ప్రధాన సూత్రధారుల గుర్తింపు కోసం దర్యాప్తు ప్రారంభించారు.

**బాంబు పేలుళ్లకు విజయనగరంలో రిహార్సల్స్!**

ఇద్దరికీ సౌదీ అరేబియా నుంచి ఐసిస్ మాడ్యుల్ ఆదేశాలిచ్చినట్లు తెలుస్తోంది. గతంలో రంపచోడవరం అటవీ ప్రాంతంలో వీరు బాంబు పనితీరుపై రిహార్సల్స్ చేసినట్లు గుర్తించారు. గత 6 నెలల్లో సిరాజ్ 3 సార్లు సౌదీ వెళ్లినట్లు పోలీసులకు వివరాలు అందాయి. అందిన సమాచారాలపై నిర్ధారణకు సిరాజ్, సమీర్‌ను పోలీసులు కస్టడీకి కోరనున్నారు.

**'అహిం' పేరిట కార్యకలాపాలు.. ఇన్‌స్టాలో సంప్రదింపులు**

సిరాజ్ ఉర్ రెహ్మాన్‌తో పాటు సికింద్రాబాద్ బోయిగూడకు చెందిన సయ్యద్ సమీర్ (28)ను పోలీసులు అరెస్ట్ చేశారు. సిరాజ్ ఇంజినీరింగ్ పూర్తి చేసి ఉద్యోగాన్వేషణలో ఉండగా.. సమీర్ లిఫ్ట్ ఆపరేటింగ్ సంస్థలో పని చేస్తున్నాడు. ప్రాథమిక ఆధారాలను బట్టి వీరిద్దరు అల్ హింద్ ఇత్తేహాదుల్ ముస్లిమీన్ (అహిం) పేరిట సంస్థను ఏర్పాటుచేసి కార్యకలాపాలు సాగించారు. ఆ సంస్థకు సిరాజ్ నంబర్‌వన్‌గా, సమీర్ నంబర్‌టూగా వ్యవహరించారు. విశ్వసనీయ సమాచారం ప్రకారం.. సౌదీ అరేబియా నుంచి గుర్తు తెలియని ఉగ్రవాద సంస్థ హ్యాండ్లర్ ఉగ్రకుట్రల కోసం వీరికి మార్గనిర్దేశం చేసినట్లు దర్యాప్తు అధికారులు గుర్తించారు. ఆ హ్యాండ్లర్ ప్రధానంగా ఇన్‌స్టాగ్రామ్ ఖాతా ద్వారా వీరితో సంప్రదింపులు జరిపినట్లు సమాచారం లభించింది. ఇలా ఆ యువకులు దేశంలో పక్కా ప్రణాళిక ప్రకారం పేలుళ్లకు పథకరచన చేసి ఉగ్ర కార్యకలాపాల విస్తరణకు పన్నాగం పన్నారు. అందుకోసం పొటాషియం క్లోరేట్, సల్ఫర్ తదితర పేలుడు రసాయనాలను ఆన్‌లైన్ ద్వారా కొనుగోలు చేశారు. పేలుడు పదార్థాల తయారీపైనా ఆన్‌లైన్‌లోనే అవగాహన పెంచుకున్నారు. ఈ నెల 21 లేదా 22 తేదీల్లో విజయనగరం పరిసరాల్లో బాంబుపేలుళ్లకు రిహార్సల్స్ నిర్వహించాలని నిర్ణయించారు. ఇంతలోనే ఆంధ్రప్రదేశ్, తెలంగాణ పోలీసులు సంయుక్తంగా వీరి కుట్రను భగ్నం చేశారు. నిందితులు మరికొందరు యువకులు, మైనర్లతోనూ తరచూ సమావేశాలు నిర్వహించారు.

**గ్రూప్-2 సన్నద్ధత పేరిట హైదరాబాద్‌కు..**

గ్రూప్-2 పరీక్షలకు సన్నద్ధం కావాలనే కారణంతో సిరాజ్ విజయనగరం నుంచి హైదరాబాద్‌కు మకాం మార్చాడు. ఆ సమయంలోనే అతడు, సమీర్ పలుమార్లు కలిసి చర్చించుకున్నారు. అనంతరం సిరాజ్ గ్రూప్-2 పరీక్ష రాసేందుకు విజయనగరం వెళ్లిపోయాడు. పేలుళ్ల రిహార్సల్స్ కోసం విజయనగరంలోని తన చిరునామాకే ఆన్‌లైన్‌లో పేలుడు రసాయనాలను తెప్పించుకున్నాడు. వీరి కార్యకలాపాలపై ఉప్పు అందడంతో నిఘా ఉంచిన తెలంగాణ ఇంటెలిజెన్స్ వర్గాలు.. ఏపీ పోలీసులను అప్రమత్తం చేశాయి. దీంతో శనివారం విజయనగరంలో పోలీసులు సిరాజ్ ఇంటిపై దాడి చేసి పేలుడు రసాయనాలను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం ఇంటెలిజెన్స్ అధికారులు సికింద్రాబాద్‌లో సమీర్‌ను అదుపులోకి తీసుకుని ట్రాన్సిట్ వారంట్‌పై విజయనగరం తీసుకెళ్లారు.

హ్యాండ్లర్ వీరిని 'మ్యాజిక్‌లాంతర్' ద్వారా ఎంచుకున్నట్లు దర్యాప్తులో వెల్లడైంది. సోషల్ మీడియాలో ఉగ్రవాద అనుకూల పోస్టు పెట్టి, దానికి సానుకూలంగా స్పందించే (లైక్‌మైండెడ్) వారిని ఎంచుకోవడమే ఈ ప్రక్రియ ముఖ్యఉద్దేశం. అలాంటి వారిలో నుంచే వీరిద్దరినీ ఎంచుకున్నట్లు తేలింది. వీరు తమ గ్రూపులో మరో 28 మందిని చేర్చుకున్నట్లు గుర్తించారు. అగ్గిపుల్లల్లోని మందును వినియోగించి బాంబు తయారు విధానంపై హ్యాండ్లర్ వీరికి ఫైళ్లు పంపినట్లు తేలింది. దీనికి అనుగుణంగానే యువకులు బాంబును తయారు చేసినట్లు తేలింది. ఆ బాంబును సిరాజ్ ఈ నెల 12న విజయనగరంలో ప్రయోగాత్మకంగా పరిశీలించినట్లు తెలుస్తోంది. మరోసారి ప్రయోగించేందుకు సిద్ధమైన తరుణంలోనే వారిద్దరూ పోలీసులకు చిక్కారు.

# 'ఉపాధి' ఊపిరి ఆగుతోంది!

(మొదటిపేజీ తరువాయి)

అమలుచేస్తున్న ఉపాధి హామీ పథకం నానాటికీ నీరుగారిపోతోంది. ఈ పథకాన్ని పర్యవేక్షించే ఉద్యోగులకు సక్రమంగా వేతనాలు చెల్లించకపోవడం పథకం అమలుపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న టెక్నికల్ అసిస్టెంట్లకు మాత్రమే రెండు నెలల బకాయిలను రెండు రోజుల క్రితం జమ చేశారు. జిల్లా, మండల స్థాయి కార్యాలయాల్లో పని చేస్తున్న అధికారులు, ఉద్యోగులకు, క్షేత్రస్థాయిలో పని చేసే ఫీల్డ్ అసిస్టెంట్లకు మాత్రం మూడు నెలలుగా జీతాలు అందలేదు. ఇక ఉపాధి కూలీలకు మార్చి 26న చివరిసారిగా వేతనాలు చెల్లించారు. ఆతర్వాత సుమారు ఏడు వారాలుగా వేతనాలు ఇవ్వలేదు. దాంతో పల్లెపండగ పేరుతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మెటీరియల్ కాంపొనెంట్ పనులు ఎక్కడిక్కడే నిలిచిపోయాయి. గ్రామీణ ప్రాంతాల్లో వేసిన సీసీ రోడ్లు, బీటీ రోడ్ల పనులకు గత ఏడాది నవంబర్ 19న బిల్లులు చెల్లించారు. ఆ తర్వాత చెల్లించలేదు. ఈ పథకంలో భాగంగా ఫారంపాండ్స్, పశువుల పాకలు, ఇంకుడు గుంతలు, పాఠశాల ప్రహరీలు, ఫిష్ ల్యాండింగ్ ప్లాట్‌ఫారాలు నిర్మించారు. వీటికి ఆరునెలలుగా బిల్లులు అందలేదు. చేసిన పనులు నమోదు చేయడానికి అవసరమైన ఎం-బుక్స్ సరఫరా కూడా నిలిచిపోయింది. వీటిని క్షేత్రస్థాయి సిబ్బందే కొనుగోలు చేయాల్సిన దుస్థితి నెలకొంది. డబ్బులతో ముడిపెడిన పనులు మినహా మిగతా అంశాలన్నింటిపైనా డ్వామా పీడీ రాత్రి 12 గంటల వరకు గూగుల్‌మీట్ పేరుతో ఆ విభాగం అధికారులు, సిబ్బందిని మానసికంగా ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. ఎం-బుక్‌లనైనా కనీసం సరఫరా చేయాలని మండల సిబ్బంది జిల్లా అధికారికి మొరపెట్టుకుంటే ఇంట్లో వస్తువులు, వంటిపై బంగారం తాకట్టుపెట్టి కొనుగోలు చేయాలని సలహా ఇస్తున్నారని డ్వామా ఉద్యోగులు విమర్శలు గుప్పిస్తున్నారు.

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 2024-25 ఆర్థిక సంవత్సరంలో ఉపాధి హామీ పథకంలో భాగంగా జిల్లాలోని వివిధ ప్రభుత్వ శాఖల ద్వారా రూ.99.29 కోట్ల అంచనా వ్యయంతో 36,447 రకాల పనులు గుర్తించి, మంజూరు చేశారు. వీటిలో గ్రామీణ ప్రాంతాల్లో సీసీ, బీటీ రోడ్డు నిర్మాణాలకు పల్లెపండగ పేరుతో ఒక కార్యక్రమాన్ని చేపట్టారు. వీటిలో పంచాయతీరాజ్ పరిధిలో సీసీ, బీటీ రోడ్ల నిర్మాణానికి రూ.72.15కోట్ల వ్యయంతో 5,644 పనులు, గిరిజన సంక్షేమ శాఖ పరిధిలో సీసీ, బీటీ రోడ్ల కోసం రూ.7.90 కోట్ల అంచనాతో 162 పనులు చేపట్టారు. సమగ్రశిక్ష పరిధిలో పాఠశాల ప్రహరీలు నిర్మాణానికి రూ.1.86 కోట్ల అంచనాతో 209 పనులకు శ్రీకారం చుట్టారు. ఆర్ అండ్ బి పరిధిలో బీటీ రోడ్ల నిర్మాణం, ప్యాచ్‌వర్కుల కోసం రూ.6.22 కోట్ల అంచనాతో 41 పనులు చేపట్టారు. గ్రామీణ నీటి సరఫరా, పారిశుధ్యం పరిధిలో వాటర్ వర్క్స్ రూ.57.70 లక్షల వ్యయంతో 59 పనులకు అవకాశం ఇచ్చారు. నీటిపారుదల ఎస్ఈ పరిధిలో 1.04 కోట్లతో 114 పనులు. వంశధార ఎస్ఈ పరిధిలో సాగునీటి కాలువలు మరమ్మతుల కోసం రూ.1.82 కోట్ల అంచనాతో 82 పనులకు శ్రీకారం చుట్టారు. మొత్తం ఏడు ప్రభుత్వ శాఖల పరిధిలో రూ.91.061 కోట్ల అంచనాతో 6,311 పనులు చేయాలని నిర్ణయించారు. వీటిలో ఇప్పటి వరకు కేవలం 4,018 పనులు మాత్రమే ప్రారంభం కాగా 2,274 పనులు పూర్తయ్యాయి. మిగతా పనులు ప్రారంభానికే నోచుకోలేదు. ఇరిగేషన్, వంశధార ఎస్ఈల పరిధిలో పనులు ప్రారంభం కాలేదు. ఆర్థిక సంవత్సరం ముగిసేనాటికి ప్రారంభమైన పనులకు ఒక్క పార్టు కింద కేవలం రూ.19.28 కోట్లు మాత్రమే జమ చేసింది. పనులు పూర్తి, ప్రారంభం కాకపోవడానికి బిల్లులు చెల్లింపులు ఆరు నెలలుగా నిలిచిపోవడమే కారణం. ఆర్థిక సంవత్సరం ముగిసినా బిల్లు చెల్లింపులు చేయకపోవడంతో తెలుగుతమ్ముళ్లు, కూటమి పార్టీల కార్యకర్తలు లబోదిబోమంటున్నారు.

**ఆర్థిక సంవత్సరం ముగిసినా..**

ఎచ్చెర్ల, హిరమండలం, నరసన్నపేట, టెక్కలి, పలాస క్లస్టర్ల పరిధిలో పశువుల షెడ్లు, ఫారం పాండ్స్, ఇంకుడు గుంతలు తదితర 30,136 పనులకు రూ.8.23 కోట్ల అంచనాతో శ్రీకారం చుట్టారు. వీటిలో 14,846 పనులు మాత్రమే ప్రారంభించగా 3,553 పనులు మాత్రమే పూర్తయ్యాయి. ప్రారంభమైన పనుల కోసం ఆర్థిక సంవత్సరం ముగిసే నాటికి కేవలం రూ.3.13 కోట్లు మాత్రమే లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేశారు. దీంతో ఆర్థిక సంవత్సరం ముగిసినా 50 శాతం పనులు ప్రారంభం కాలేదు, 10 శాతం పనులు కూడా పూర్తి చేయలేకపోయారు. పంచాయతీల్లో వైకాపా సర్పంచులతో సంబంధం లేకుండా ప్రభుత్వం కల్పించిన వెసులుబాటుతో ఈ పనులన్నింటినీ మంజూరుచేసి కూటమి నాయకులు, కార్యకర్తలనే వెండర్లుగా చూపించి గంపగుత్తగా పనులు అప్పగించారు. అయితే బిల్లులు చెల్లింపులు సకాలంలో జరగకపోవడంతో పనులన్నీ నిలిచిపోయాయి. పూర్తిచేసిన పనులకు బిల్లులు ఎప్పుడు చెల్లిస్తారో ప్రభుత్వం నుంచి క్లారిటీ లేదు.

# అరకొర సౌకర్యాలతో సేవలు ఎలా?

- **సిద్ధమైన ఇచ్ఛాపురం డయాలసిస్ కేంద్రం**
- **పూర్తిస్థాయిలో సమకూరని వసతులు**
- **ఇప్పటికే ప్రారంభంలో జాప్యం.. అయినా లోపాలు**

(డి.వి.రమణ, సత్యం ప్రత్యేక ప్రతినిధి)

ఉద్దానం ప్రాంతంలో ప్రబలంగా ఉన్న కిడ్నీ రోగులకు ఉపకరించేలా రాష్ట్ర ప్రభుత్వం ఇచ్ఛాపురం ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన డయాలసిస్ సెంటర్ ప్రారంభానికి సన్నాహాలు జరుగుతున్నాయి. ఇది అందుబాటులోకి వస్తే డయాలసిస్ సేవలు మరింత మెరుగవుతాయని ఉద్దానం ప్రాంత కిడ్నీ బాధితులు ఆశగా ఎదురుచూస్తున్నారు. అయితే చాలా కాలం జాప్యం తర్వాత ఈ కేంద్రం ప్రారంభమవుతున్నా.. ఇంకా చాలా సమస్యలు ఉన్నాయని, కొన్ని ముఖ్యమైన సౌకర్యాలు పూర్తిగా అందుబాటులోకి రాలేదని తెలిసింది. వీటిని పరిష్కరించకపోతే కేంద్రం సేవలు ప్రారంభమైనా పెద్దగా ఉపయోగం ఉండకపోవచ్చని వాదనలు వినిపిస్తున్నాయి. ఇచ్ఛాపురం పట్టణంలో ప్రసూతి, శిశు ఆరోగ్య కేంద్రం భవనానికి 2008లో అప్పటి ఎమ్మెల్యే నరేష్‌కుమార్ అగర్వాలా శంకుస్థాపన చేయగా.. 2011లో అప్పటికే కాంగ్రెస్ ప్రభుత్వంలో మంత్రిగా ఉన్న ధర్మాన ప్రసాదరావు ఆస్పత్రి భవనాన్ని ప్రారంభించారు. కాగా గత వైకాపా ప్రభుత్వం ఉద్దానంలో కిడ్నీ వ్యాధి నియంత్రణ చర్యలు, వ్యాధి పీడితులకు వైద్యసేవలు మెరుగుపరిచే క్రమంలో ఇచ్ఛాపురం పట్టణానికి డయాసిస్ కేంద్రాన్ని మంజూరు చేసింది. అందుకు అవసరమైన ఐదు డయాలసిస్ యంత్రాలు, ఇతర పరికరాలు అప్పట్లోనే సరఫరా చేసింది. అయితే కేంద్రం నిర్వహణకు అవసరమైన ఇతర మౌలిక వసతుల కల్పనలో తీవ్ర జాప్యం జరగడంతో ఆ కేంద్రం ఇప్పటివరకు అందుబాటులోకి రాలేదు. ఎట్టకేలకు వాటన్నింటినీ పూర్తి చేసి ప్రారంభానికి సిద్ధం చేసినట్లు అధికారవర్గాలు పేర్కొంటున్నాయి. కానీ కొన్ని ముఖ్యమైన వసతులు ఇంకా కల్పించాల్సి ఉందని ఇచ్ఛాపురం నియోజవర్గ





నాయకుడు శాడి శ్యాంప్రసాద్‌రెడ్డి, పట్టణ కౌన్సిలర్ పిలక విజయ్ అంటున్నారు. వారిద్దరూ డయాలసిస్ కేంద్రాన్ని పరిశీలించి కొన్ని లోటుపాట్లను గుర్తించారు.

**నీరు, విద్యుత్, సిబ్బంది అసంపూర్ణం**

డయాలసిస్ కేంద్రానికి దాదాపు అన్ని సౌకర్యాలు సమకూరినా కీలకమైన మూడు సౌకర్యాలు అరకొరగా ఉన్నాయి. దానివల్ల కేంద్రం ప్రారంభమైన తర్వాత రోగులకు సేవల్లో ఇబ్బందులు తలెత్తే ప్రమాదం ఉంటుందంటున్నారు. డయాలసిస్ సేవలు అందించేందుకు నిరంతర విద్యుత్ సరఫరా ఉండాల్సిన అవసరముంది. విద్యుత్ అంతరాయం ఏర్పడినా ఇబ్బంది లేకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు ఉండాలి. కానీ ఈ కేంద్రంలో ఎమర్జెన్సీ పవర్ సప్లై వ్యవస్థ ఏర్పాటు చేయలేదు. దీనివల్ల డయాలసిస్ చేస్తున్నప్పుడు కరెంటు పోతే ఆ ప్రక్రియ మధ్యలో నిలిచిపోయే ప్రమాదం ఉంది. కవిటి, సోంపేట డయాలసిస్ కేంద్రాల్లో నెఫ్రో ప్లస్ సిబ్బంది సేవలు అందిస్తుండగా ఇచ్ఛాపురం కేంద్రానికి మాత్రం ఢిల్లీకి చెందిన ఒక కొత్త సంస్థ ద్వారా సిబ్బందిని సమకూర్చారు. వారంతా కొత్తవారు.. అది కూడా సరిపడినంత మంది లేకపోవడం వల్ల సేవల్లో జాప్యం జరిగే అవకాశముంటుంది. డయాలసిస్‌కు అత్యంత ముఖ్యం.. నాణ్యమైన నీరు. ఇందుకోసం కేంద్రం ఆవరణలో వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేశారు. అంతవరకు బాగానే ఉన్నా.. ఆ ప్లాంట్ నీటి నాణ్యతను నిర్ధారించడానికి ఢిల్లీ ల్యాబ్‌కు పంపాలని నిర్ణయం తీసుకున్నారు. ఢిల్లీకి శాంపిల్స్ పంపడానికి, అక్కడి నుంచి రిపోర్టు రావడానికి ఎలా లేదన్నా మూడు రోజులు పడుతుంది. దీనివల్ల డయాలసిస్ కేసుల నిర్వహణలో జాప్యం ఏర్పడే ప్రమాదముంది. నాణ్యత నిర్ధారణ కాకుండానే నీటిని వాడితే ఇతరత్రా ఆరోగ్య సమస్యలు ఉత్పన్నమవుతాయి. ఈ లోటుపాట్లను అధికార యంత్రాంగం తక్షణమే సరిదిద్దాలని, తద్వారా కిడ్నీ రోగులకు నాణ్యమైన సేవలు అందేలా చూడాలని శ్యాంప్రసాద్‌రెడ్డి, విజయ్ విజ్ఞప్తి చేశారు.

Printed by N.V.S. prasad, at Srikakulam and published by SATYAM PRINTERS, plot No. 8, Santamma colony, Srikakulam- 532001, Andhrapradesh on behalf of SANCHALANA SAYANKALA PATRIKA SATYAM, Srikakulam. Editor N.V.S. Prasad, Srikakulam, Andhra Pradesh. APTEL No. 2005/17967. Postal Reg. No. D/RNP/SKL-12/12-15.